www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శుక్రవారం 14,ఆగస్టు, 2026

# డీసిల్టేషన్ పై ఎన్జీటి ఎఫెక్ట్

## సీతమ్మసాగర్ డీ సిల్టేషన్ పై గ్రీన్ ట్రిబ్యునల్ స్టే

- మంత్రి సీతక్కకు చెంపపెట్టు
- అనుచరుల దోపిడీకి మంత్రి అడ్డుకట్ట వేయాలి
- ఏ తప్పు చేయకపోతే అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- అక్రమ తవ్వకాల పై నిగ్గు తేల్చాలి
- సుప్రీంకోర్టు గైడెన్స్ నూ విస్మరించారు
- రెడ్కో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి




ములుగు జిల్లాలోని ఇసుక అక్రమాలకు సంబంధించి బిఆర్ఎస్ పార్టీలోని కొందరు నేతలు చేస్తున్న పోరాటానికి సానుకూల ఫలితాలు వస్తున్నాయి. జిల్లాలో సాగుతున్న అనైతికమైన డి శిల్టేషన్ వ్యవహారంపై బి ఆర్ఎస్ పార్టీకి చెందిన రెడ్కో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి చేసిన పోరాటం నేపథ్యంలో తాజాగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు నైతిక విజయం అందించినట్లుగా అయింది. మొదటినుంచి సతీష్ రెడ్డి ఇసుక అక్రమాలపై క్రమం తప్పని ఆరోపణలు చేస్తూ ములుగు జిల్లాకే చెందిన మంత్రికి కూడా భాగస్వామ్యం ఉందనే విమర్శలు చేశారు ఈ నేపథ్యంలోనే అటు బిఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ పార్టీల మధ్య మాటలు యుద్ధం విమర్శల పోరు సాగింది ఈ నేపథ్యంలోని తాజాగా ఇచ్చిన ఎన్జీటీ తీర్పు తర్వాత టిఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా మంత్రి తమ అనుచరులు చేస్తున్న ఇసుక దందాలు అరికట్టాలని అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఈ అవినీతి పాపంలో మంత్రికి కూడా భాగస్వామ్యం ఉందని అపవాదును నిజం చేసినట్లు అవుతుందని స్పష్టం చేశారు. మరి మంత్రి వైఖరి ఏంటో దీనిపై ఆమె సమాధానం ఎలా ఉంటుందో వే చూడాల్సిందే

...నివాస్ బట్టు

## సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి


6లో

నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ..

సీతారామ ప్రాజెక్టు పనులపై సుదీర్ఘ చర్చ

మూడో నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో 532 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి

## చిన్న పొరపాటు కూడా జరగొద్దు


8లో

- సకాలంలో పనులన్నీ పూర్తవ్వాల్సిందే
- సమన్వయంతో పని చేయండి
- పైలాన్ నిర్మాణ పనుల్లో ప్రమాణాలు తప్పనిసరి

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క

# డీసిల్టేషన్ పై " ఎన్జీటి" ఎఫెక్ట్





**మొదటి పేజీ తరువాయి**

సీతమ్మసాగర్ లో డీసిల్టేషన్ పేరుతో అక్రమంగా ఇసుకను దోచుకుంటున్న సర్కారు పెద్దలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెంపపెట్టులాంటి ఆదేశాలు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు, రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి అన్నారు. డీ సిల్టేషన్ ఆపాలని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలను ఆయన స్వాగతించారు. అసలు ప్రారంభమే కాని రిజర్వాయర్ లో డీసిల్టేషన్ పేరు చెప్పి.. మంత్రి సీతక్క ఆమె అనుచరులు పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆయన అన్నారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ఉన్నా కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. కొందరు అధికారులు కూడా మంత్రి చెప్పుచేతల్లో పని చేసి నిబంధనలు పక్కనపెట్టి.. ఈ పాపంలో పాలు పంచుకున్నారని చెప్పారు.

అక్రమంగా ఇసుక తవ్వుతున్నారని.. దాన్ని ఆపేయాలని తాను స్వయంగా కలెక్టర్ కు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు తవ్వకాలు ఆపలేదని మండిపడ్డారు. యధేచ్ఛగా తవ్వకాలు జరిపి నది ఒడ్డున పెద్ద ఎత్తున ఇసుక డంప్ చేశారన్నారు. అక్రమంగా ఇసుక తవ్వుతున్నారని వీడియో తీస్తే దానిపైనా కేసు పెట్టారని వివరించారు.


Item No.02:-

BEFORE THE NATIONAL GREEN TRIBUNAL
SOUTHERN ZONE, CHENNAI

(Through Physical Hearing (Hybrid Option))

Original Application No.105 of 2026(SZ)

IN THE MATTER OF:

Punem Ramulu & Ors.

Applicant(s)

Versus

The State of Telangana,
Represented by its Chief Secretary,
Hyderabad and Ors.

Respondent(s)

Date of hearing: 11.08.2026.

CORAM:

HON'BLE Smt. JUSTICE PUSHPA SATHYANARAYANA, JUDICIAL MEMBER

HON'BLE Dr. PRASHANT GARGAVA, EXPERT MEMBER

For Applicant(s): M/s. Rana Sandeep Bussa & Penuballi Ramesh Babu.

For Respondent(s): Mr. S. Rahul Reddy, Spl. Govt. Pleader a/w. Mrs. H. Yasmeen Ali for R1, R3, R4 & R6 to R8. Mr. B. Rajaprabhakar represented Mr. T. Sai Krishnan for R5.

Page 1 of 4

ఇప్పుడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలతో అయినా మంత్రి సీతక్క, ములుగు జిల్లా అధికారులు, మైనింగ్ అధికారులు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక తవ్వకాలు ఇప్పటికైనా ఆపేయాలని కోరారు. నిజంగానే మంత్రి సీతక్కకు అక్రమ ఇసుక తవ్వకాలతో సంబంధం లేకపోతే ఇప్పటి వరకు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నిజంగానే మంత్రికి ఏ పాపం తెలియకపోతే వెంటనే.. ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చిన మైనింగ్ అధికారులు, కలెక్టర్, కిందిస్థాయి అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖచ్చితంగా ఇసుక దందా వెనక సీతక్క ఉన్నారని అందుకే ఇప్పటి వరకు మాట్లాడలేదని ఆయన ఆరోపించారు.




# వర్షాకాలం... జర జాగ్రత్త

**- పరిసరాలు వ్యక్తిగత శుభ్రత అవసరం**

**- కలుషిత నీరు ఆహారం తినొద్దు**

**- రోగాల బారిన పడితే నిర్లక్ష్యం వద్దు**

**- ఈ సీజన్ లో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం**

**- జాగ్రత్తగా ఉండాలంటున్నా వైద్యులు**

**చంద్రుగొండ ఆగస్టు 13(భద్రాద్రి న్యూస్):**

వర్షాకాలశీ... వ్యాధులకు ఆజ్యం పోసే సమయం. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే అనారోగ్యం పాలవుతాం. పరిసరాలు చెత్త చెదరంతో నిండిపోతే దోమలు విజృంభిస్తాయి. దీంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడతాం.అలాగే కాలుషిత తాగునీటి వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. వానాకాలంలో అనారోగ్యం పాలవకుండా ఉండాలంటే కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు..

**- దోమలు వల్ల వచ్చే వ్యాధులు**

మలేరియా,ఫైలేరియా, డెంగ్యూ, మెదడువాపు, చికెన్ గున్య,లాంటి వ్యాధులు వస్తాయి. నీటిలో పెరిగే ఆడ అనాఫినిష్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. చలి వణుకుతో కూడిన జ్వరం చెమటలు పడటం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే మురుగు నీటిలో పెరిగే దోమ కాటు వల్ల ఫైలేరియా సోకుతుంది దీనివల్ల కాళ్లు చేతులకు వాపులు వస్తాయి. కాళ్లకు వచ్చిన వాపు దీర్ఘకాలంగా ఉండిపోయే అవకాశం ఉంది. మొదట్లోనే గుర్తించకపోతే జీవితాంతం బంధిస్తుంది.పాత డబ్బాలు,కుండలు, కొబ్బరి చిప్పలు, ఎయిర్ కూలర్, పూలకుండీలు, వాహన టైర్లు, ట్యూబ్ లో ఉన్న నీటి నిల్వల్లో ఏడీస్ దోమ పెరుగుతుంది.ఆ దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుంది దీనివల్ల ఎముకలు, కండరాళ్లు,కీళ్ల నొప్పులతో కూడిన తీవ్రమైన జ్వరం, చర్మంపై మచ్చలు, చిగుళ్ళు ముక్కు, మలం ద్వారా ఎక్కువ శాతం రక్తం పోతుంది. క్యూలెక్స్ దోమ కాటు ద్వారా మెదడువాపు వ్యాధి బారిన పడతాం. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు స్పృహ కోల్పోవడం జరుగుతుంది. చిన్నారులలో ఎక్కువగా మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. అలాగే దోమల వల్ల వచ్చే మరో ప్రమాదకవ్యాధి చికెన్ గున్యా,జ్వరం కీళ్లలో భరించలేనంత నొప్పులు వస్తాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది.

**- కలుషిత నీటి వల్ల**

గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటిని సరఫరా చేసే పైప్ లైన్లు లీకేజీ కారణంగా నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.దీని ద్వారా డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, రక్త బంక ,విరోచనాలు, అమీబియాసిస్ లాంటి వ్యాధులు సంభవిస్తాయి.

**- తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఆహారం తినే ముందు మలమూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలి. శుభ్రంగా కడుక్కొని కూరగాయలు, ఆకుకూరలు ,పండ్లు మూతలు పెట్టని ఆహారాన్ని, కలుషితమైన ఆహారాన్ని తినకూడదు.ఆహార పదార్థాలపై బొద్దింకలు,ఈగలు, దోమలు,వాలకుండ చూసుకోవాలి. రైతులు కూలీలు చెరువులు కుంటలు కాల్వలో పారే నీటిని తాగకుండా ఉండటం మంచిది.

**- నివారణ చర్యలు**

ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలి. గుంటలు లోతట్టు ప్రదేశాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలి. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇంటి ఆవరణలో ఉన్న పాత రేకు డబ్బాలు, కుండలు,కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, లాంటి వాటిలో నీరు లేకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా ఇళ్లల్లో దోమతెరలను వాడాలి.





భద్రాద్రి న్యూస్

శుక్రవారం 14,ఆగస్టు, 2026

# యుద్ధ ప్రాతిపదికన మేడారం అభివృద్ధి







**సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కసరత్తు**

**ముఖ్యమంత్రికి స్వాగత ఏర్పాట్లు**

**సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్లకు శ్రీకారం.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**భద్రాద్రి న్యూస్ తాడ్వాయి**

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మేడారం ప్రాంతాన్ని ముస్తాబు చేయాలని, ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

గురువారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణానికి వచ్చి శ్రీ



సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి, ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు.

ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ,

అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

మేడారానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరుపేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న అనంతరం శ్రీ సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో సంతృప్తి స్థాయిలో పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో

ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**సీపీఎస్ రద్దు చేయాలి**

**2003 డీఎస్సీకి ఓపీఎస్ ఇవ్వాలి**

**ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి**



**వెంకటాపురం, ఆగస్టు 13, భద్రాద్రి న్యూస్:**

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేసి ఎలక్షన్లు ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ను అమలు చేయాలని ఉద్యోగాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్కు మెమోరాండం అందజేశారు.

మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, కేజీబీవీ, యూత్లైన్స్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు పాడి నరసయ్య, ములుకల వెంకటస్వామి, కో నరసయ్య, కె. సతీష్, బి. జయరాం, బి. లక్ష్మయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ జర్నలిస్ట్ లకు ప్రత్యేక జి ఓ ద్వారా ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

**అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ( ఖయఅ) జిల్లా కమిటీ....**

**భద్రాద్రి న్యూస్ భద్రాచలం**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 90 శాతానికి పైగా ఏజెన్సీ ప్రాంతం. జిల్లాలో 1,225 మంది జర్నలిస్ట్ లు వివిధ సంస్థలకు చెందిన పత్రికలు, ఛానల్స్ లో విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ చట్టాల పేరుతో జిల్లాలో పనిచేసే జర్నలిస్ట్ లకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం జర్నలిస్ట్ ల కనీస హక్కును హరించినట్లు అవుతుంది. ఈ మేరకు జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ మొబగాపు ఆనంద్ కుమార్, సంయుక్త కన్వీనర్ తోకల నాగేశ్వరావు, కో - కన్వీనర్ కే. దామోదర్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఏజెన్సీ జర్నలిస్ట్ లను ప్రభుత్వం అందించే ఇందిరమ్మ గృహాలు 2ఎ బి హెచ్ కె 3 బి హెచ్ కె పథకాల్లో చేర్చాలని,. ఏజెన్సీ చట్టం అని వాయిదా వేయకుండా, దీనికోసం ప్రత్యేక జి ఓ తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు.

అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్ట్ లు అందరికి 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ మరియు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందేలా హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని,

60 సంవత్సరాలు దాటిన సీనియర్ జర్నలిస్ట్ లకు నెలకు రు. 10,000 పెన్షన్ అందజేయాలని,జర్నలిస్ట్ లు విధినిర్వహణలో మరణిస్తే, వారి కుటుంబానికి రు. 25 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేయాలని జర్నలిస్ట్ లపై దాడులు జరిగితే, పోలీస్ స్టేషన్లో వెంటనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి జర్నలిస్ట్ లకు న్యాయం చేయాలని,

ప్రతి మండల హెడ్ క్వార్టర్స్ లో ప్రెస్ క్లబ్ భవనం ప్రభుత్వం నిర్మించాలని,చిన్న పత్రికలు, వెబ్ పోర్టల్ లకు కూడా గవర్నమెంట్ యాడ్స్ ఇవ్వాలని కోరారు .

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ సంకల్పం

**మహిళా శక్తిని వ్యాపార శక్తిగా మార్చడమే లక్ష్యం**

**స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**

**మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి**

**ములుగు పర్యాటక సంపద మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశాల గని**

**మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా 'ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్'**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**భద్రాద్రిన్యూస్ ములుగు**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సహాయక సంఘాల సభ్యులను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని,మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉపాధి కల్పించే ఉన్నత స్థాయికి చేరుకోవాలని,మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా ఇంక్యుబేటర్ కార్యక్రమం నూతన వేదికగా మారుతుందని పేర్కొన్నారు

గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అవగాహన, ప్రణాళిక కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాలను గుర్తించి, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక సహకారం అందించాలని ప్రధాన ఉద్దేశంతో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మహిళా ఆధారిత వ్యాపారాలను గుర్తించి, వాటి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలకు వ్యాపార విస్తరణ, మార్కెటింగ్, యంత్రాలు, పరికరాలు, ముడిసరుకు తదితర అవసరాల కోసం రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం తో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబాలు బాగుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యంపై ముఖ్యమంత్రి




ఎనుముల రేవంత్ రెడ్డికి అపారమైన నమ్మకం ఉందని, అందుకే మహిళా సంఘాలకు వివిధ వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోందని, ములుగు జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీ మొత్తాన్ని మహిళలకు తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మండల సమాఖ్యలకు బస్సులను అందించి ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 16వ తేదీన శ్రీ సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అర్హులైన వారిని గుర్తించి ఆగస్టు 31వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల కోసం పోరాడి వనదేవతలుగా కొలువుదీరిన సమ్మక్క--సారలమ్మ మహిళలందరికీ గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.

మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని, తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. బిట్స్ పిలానీ సహకారంతో అందించే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి వ్యాపారం పట్ల ఆసక్తి, వినూత్న ఆలోచనలు కలిగిన మహిళలను గుర్తించి శిక్షణకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న వ్యాపారంతో ప్రారంభించి సరైన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలను అందిపుచ్చుకుంటే మహిళలు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చని అన్నారు.

ములుగు జిల్లాలోని అపారమైన ప్రకృతి, పర్యాటక సంపదను మహిళల ఆర్థికాభివృద్ధికి అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. మేడారం శ్రీ సమ్మక్క--సారలమ్మ, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, గోదావరి తీరం, దట్టమైన అడవులతో జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు,



మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా లభించే ఇప్పపువ్వు, అరటి, మిరప తదితర ఉత్పత్తులకు విలువ జోడించి ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

మహిళా సంఘాల విజయగాథలు ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ప్రత్యేక మాసపత్రికను రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్న స్థాయి నుంచి వ్యాపారవేత్తలుగా ఎదిగిన మహిళలు చేపట్టిన వ్యాపారాలు, సాధించిన విజయాలను అందులో ప్రచురిస్తామని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో విజయవంతమైన మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి వారి విజయగాథలను సెర్ప్‌కు పంపించాలని, ఫొటోలు, కథనాలు, వీడియోల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు చేరవేయాలని అధికారులకు సూచించారు.

ములుగు జిల్లా భవిష్యత్తులో ప్రధాన పర్యాటక, విద్యా, వైద్య కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సమ్మక్క--సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో జిల్లాలో వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. ఈ అవకాశాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకునేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు రూ.1 కోటి 50 లక్షల తో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా, మరికొందరికి ఉపాధి కల్పించే శక్తిగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఆర్డీఓ రవీందర్, బిట్స్ పిలానీ ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కృష్ణ,జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె. అనూష, డీపీఎంలు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది నిండని పసికందులాంటి కార్పొరేషన్ ను చిదిమేయకండి

**కొత్తగూడెం కార్పొరేషన్ 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'కు అర్హత సాధించిపెట్టా**

**డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం**

**విమర్శల నివృత్తికే ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశం**

**రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అబద్ధం**

**అబద్ధపు ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు సృష్టించొద్దు**

**అది నీతి అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం టౌన్ , ఆగస్టు 13( భద్రాద్రిన్యూస్) :**

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆయా పనులకు సంబంధించిన డిపిఆర్ తయారీ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు కానున్నాయని, పనుల అంచనాల ప్రకారమే కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా మరియు బ్యాంకుల రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా లక్ష కోట్ల కేంద్ర సహాయంతోపాటు 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.2,670 కోట్ల రుణం వస్తుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం 'వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్'కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే, అందులో ఏకంగా రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఇతర పట్టణాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని, అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్ల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని, అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో అపోహలు సృష్టించారని, ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేయడానికి ఆఫ్‌లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ అధీనంలోనే ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టీఎండీపీ) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని, అనవసర ఆరోపణలు చేస్తే వెంటాడతామని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరావు, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గడ్డం శాంతిప్రియ, గడ్డం వెంకటేశ్వర్రావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల, మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్

శుక్రవారం 14,ఆగస్టు, 2026

# జైత్రామ్'కు మెరుగైన వైద్యం అందించాలి

**బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని**

**ఖమ్మంలో కార్పొరేషన్ కార్మికుడిని పరామర్శించిన ఎమ్మెల్యే**

**కొత్తగూడెం టౌన్ ,ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్ ):**



విద్యుత్ దీపాలు అమర్చుతూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన మున్సిపల్ మల్టీ పర్పస్ కార్మికుడు భూక్యా జైత్రామ్ కు ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వైద్యులను ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంగపేట 23వ డివిజన్‌కు చెందిన మున్సిపల్ కార్మికుడు భూక్యా జైత్రామ్ విద్యుత్ స్తంభంపై దీపం ఏర్పాటు చేస్తుండగా జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుడిని మొదట కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని మమత జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ఆస్పత్రికి వెళ్ళి చికిత్స పొందుతున్న జైత్రామ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నందున ప్రాణాపాయం తప్పించేలా నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదానికి గురైన కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన త్వరగా కోలుకోవాలని కూనంనేని ఆకాంక్షించారు.

# 80 వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయండి

**రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వెలిశోజు రామ మనోహర్**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్ ):-**



రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ మరియు వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్ లోని పెన్షనర్స్ సంఘ కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తేదీ 15 ఆగస్టు 2026 నాడు నిర్వహించడం జరుగుతుంది. ఉదయం 9 గం లకు హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ నరసింహారెడ్డి గారు జాతీయ పతాక ఆవిష్కరణ గావిస్తారు.అనంతరం పెద్ద మీటింగ్ హాల్ లో హనుమకొండ మరియు వరంగల్ జిల్లా అధ్యక్షుల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ,జిల్లా నాయకులు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత ను వివరిస్తారు. అనంతరం డా!! ఎస్ పురుషోత్తమ రావు, ఎం డి ఎస్ "హెల్త్ కార్డుల పై చికిత్స - దంతముల సంరక్షణ" అనే అంశం పై ప్రసంగిస్తారు.పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేస్తారు. చివరిగా ఆర్ ఒ బి పెన్షనర్స్ రిక్రియేషన్ క్లబ్ వారు నిర్వహించిన క్రీడలలో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుంది. కావున హనుమకొండ , వరంగల్ జిల్లా శాఖల నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రెండు జిల్లా శాఖల కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

# గంజాయి పట్టివేత, ఒకరి అరెస్ట్...



అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకోని రిమాండ్ కు తరలించినట్లు సీఐ మల్లేష్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్లో విలేఖరుల సమావేశంలో సీఐ మల్లేష్ మాట్లాడుతూ పరకాల నుండి మొగుళ్లపల్లి వైపు అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నరని పోలీసులకు సమాచారం రావడంతో బుధవారం వ్యక్తిని పట్టుకునేందుకు లక్ష్మిసాయి గార్డెన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నడికూడ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు సిద్ధు, బైక్ ట్యాంక్ కవర్లో దాచిన తెల్లని ప్లాస్టిక్ కవర్ను తనిఖీ చేయగా 532 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. దీంతో సిద్దు, మరియు బైక్ ను అదుపుతోకి తీసుకోని అతన్ని విచారించగా మహారాష్ట్రలోని చంద్రపూర్ కు చెందిన సంజయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి, వివిధ ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించాడు.పరారీలో ఉన్న సంజయ్ పట్టుకువేందుకు చర్యలు కొనసాగుతున్నాయని సిద్దును న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు..మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై సురేష్ ఉన్నారు...

# సాయిబాబా ఆలయంలో అన్నదానం







**భద్రాద్రి న్యూస్ వెంకటాపురం**

వెంకటాపురంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం. భక్తులు దాతలు సహకారంతో ప్రతి గురువారం ఇక నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు క్రమం తప్పకుండా ఇక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించే విషయంలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పుర ప్రముఖులు భక్తులను ఈ కార్యక్రమంలో భాగస్వామి చేయడం విశేషం

# మార్పు కోసమే ఈ చైతన్య యాత్రలు

**158 బహిరంగ సభలు దిగ్విజయంగా పూర్తి**

**460 గ్రామాలు, బస్తీల మీదుగా యాత్ర కొనసాగింది**

**కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడతాం**

**ప్రజా చైతన్యంతోనే అసలైన మార్పు**

**అప్రజాస్వామిక పాలనపై రాజీలేని పోరాటం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



కొత్తగూడెం టౌన్ , ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్):- సిపిఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ఆగష్టు 6 నుంచి వారం రోజులపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు చేపట్టిన జన చైతన్య యాత్రలు జిల్లా వ్యాప్తంగా అత్యంత విజయవంతమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. గురువారం శేషగిరిభవన్'లో అయన మాట్లాడుతూ జిల్లాలోని 23 మండలాల పరిధిలో ఈ నెల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఈ ప్రచార యాత్రలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్రల్లో భాగంగా వివిధ గ్రామాలు, మండల కేంద్రాలలో మొత్తం 158 బహిరంగ సభలను నిర్వహించామని, 460 గ్రామాలు,బస్తీల మీదుగా పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగాయని వెల్లడించారు. వందమంది పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు యాత్ర బృందంగా పాల్గొని జయప్రదం చేశారని తెలిపారు. ఈ యాత్రల ద్వారా సుమారు మూడు లక్షల మంది ప్రజలను నేరుగా కలసి యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశాలను, ప్రజా సమస్యలపై పార్టీ పోరాట పంథాను వివరించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, రాజ్యాంగ బద్ధ సంస్థల నిర్వీర్యం వంటి చర్యలకు నిరసనగా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి, ప్రజల హక్కు సాధనకు నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. యాత్రల స్ఫూర్తితో సెప్టెంబర్ 1న ఢిల్లీ రాం లీలా మైదానంలో జరిగే జాతీయ స్థాయి ధర్నా, బహిరంగ సభకు తరలుతామని స్పష్టం చేశారు.

# జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి : పోలీస్ కమిషనర్

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్ ):-**

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి, విక్రయదారులు, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటూనే, వినియోగదారులకు సరఫరా మార్గాలను అడ్డుకోవడం సాధ్యమవుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. నేర సమీక్షాసమావేశం గురువారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ....సమాజంలో డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టి బాధితులను సాధారణ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడం చాలా ముఖ్యమని అన్నారు. పాఠశాలలు, కాలేజీలలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సమాజిక మాధ్యమాల అతిగా వాడకం వల్ల పిల్లలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని, ఇన్‌స్టాగ్రామ్,వాట్సాప్, ఫేస్‌బుక్, గేమింగ్ యాప్‌ల ద్వారా నేరగాళ్లు మైనర్ పిల్లలతో స్నేహం చేస్తున్నారని, పిల్లలను ప్రేమ పేరుతో నమ్మించి, లోబరుచుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. వ్యక్తిగత ఫోటోలు సేకరించి వాటిని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనివల్ల పోక్సో కేసు ఫిర్యాదులు సైతం పెరుగుతున్నాయని అన్నారు.పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని, వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరిని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చోరీ సొత్తు రికవరీ కేసులలో దర్యాప్తు వేగవంతం చేయడానికి సాంకేతికతను, ప్రత్యేక బృందాలను ఉపయోగించాలని, అదేవిదంగా రాత్రి గస్తీని పెంచడం, సీసీ కెమెరాల నిఘా, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, సారంగపాణి,నరసింహారావు, మహేష్, సాంబరాజు, సత్యనారాయణ, సర్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



## తీజ్ వేడుకల్లో వెల్లివిరిసిన బంజారా సంస్కృతి

**ఆచారాలను భావితరాలకు అందించాలి**

**తీజ్ పండుగకు ప్రత్యేక స్థానం -- మంత్రి సీతక్క**

**ములుగు ప్రతినిధి, ఆగస్టు 13, భద్రాద్రి న్యూస్:**



ములుగు మండలం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సారంగపల్లిలో బంజారా సమాజం నిర్వహించిన సంప్రదాయ పండుగ తీజ్ వేడుకలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి మతానికి, ప్రతి కులానికి, ప్రతి సామాజిక వర్గానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు ఉంటాయని అన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదే సమయంలో ఇతర మతాలు, కులాలు, సామాజిక వర్గాల ఆచార సంప్రదాయాలను కూడా గౌరవిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. బంజారా సంస్కృతిలో తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, మహిళలు, యువతులు సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగను ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు, యువతులతో కలిసి మంత్రి సీతక్క సాంప్రదాయ నృత్యంలో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, స్థానిక సర్పంచ్ అర్రెం వెంకన్న, బంజారా సమాజ నాయకులు, మహిళలు, యువతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

## సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్ ):-**

సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం భేటీ అయ్యారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు.

**రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి...**

మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ.45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

**సంబంధిత పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్ని సస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట మండలం లోని నాలుగో పంప్‌హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

**జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి...**

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

## ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి

**తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి లబ్ధి చేకూరేలా చర్యలు**

**రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి**

**ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం**

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి**

**నెల రోజుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించాలి**

**సుజాతనగర్,ఆగస్టు 13 (భద్రాద్రిన్యూస్ ):-**

సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా, ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, పెసర, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయ పంటలు, పెసర, పత్తి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకరకాయ, సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వాటి ప్రభావం పంటల సాగుపై పడే అవకాశం తదితర అంశాలను రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగు చేపట్టకుండా తక్కువ నీటితో సాగు చేయగల పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని సూచించారు. సింగభూపాలెం గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి అవసరాలను కాపాడుతూ వున్న నీటిని పొదుపు చెయ్యాలన్నారు .

అనంతరం సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి దశలో గ్రామానికి మొత్తం 32 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 100 శాతం ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయిందని, 11 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన లబ్ధిదారు మిరియాల అరుణ ఇంటిని పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వారి యొక్క ఆర్థిక పరిస్థితి కుటుంబ పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 220 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 92 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, ఇందులో 61 పూరి గుడిసెలకు సంబంధించిన సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పూర్తి పారదర్శకత పాటిస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం సింగభూపాలెం గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సంప్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 60 శాతం మేర తాగునీటి సరఫరా జరుగుతోందని, ప్రతి ఇంటికి 100 శాతం సురక్షితమైన తాగునీరు అందించేందుకు సంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంప్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ముందస్తు ప్రణాళికతో తాగునీటి కనెక్షన్లు కల్పించాలని ఆదేశించారు.

అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్



అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఆదేశించారు. తాను మరో నెల రోజుల్లో తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి సాధించేలా చర్యలుబ తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అనంతరం వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించి విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం, ఇతర సరుకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహ పరిసరాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి

**పినపాక ఎమ్మెల్యే, వైల్డ్ లైఫ్ బోర్డ్ మెంబర్ పాయం వెంకటేశ్వర్లుకు జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ వినతి**



**భద్రాద్రి న్యూస్ మణుగూరు, ఆగస్టు – 13:**
బూర్గంపాడు మండలం లో అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ కరెంటు ఉచ్చులో మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (భీదీూ) బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

విధి నిర్వహణలో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన బానోత్ నవీన్ అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన కరెంటు ఉచ్చుకు గురై మృతి చెందారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు టి. శోభన్, పి. ఎర్రయ్య, జి. బాబురావు, బి. వెంకన్న, నరేష్, హతిరామ్, శరన్, మదన్ లాల్ పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో సూరవీడు పంచాయతీ

**ఫార్మ్ పాండ్‌కు భూమిపూజ**

**వివోఏ భవనానికి పునాది**






**చెరువుకట్టపై మొక్కలు నాటడం**

వెంకటాపురం, ఆగస్టు 13, భద్రాద్రి న్యూస్: సూరవీడు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్, ఇరుప మురళి,ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా వివోఏ బిల్డింగ్ నిర్మాణానికి ముగ్గు పోసి పునాది పనులను ప్రారంభించారు. అలాగే రైతులకు ఉపయోగకరంగా ఉండే ఫార్మ్ పాండ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేందుకు ఫార్మ్ పాండ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సాగునీటి కొరతను తగ్గించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు దోహదపడతాయని, రైతులకు నీటి భరోసా కల్పించేందుకు ఫార్మ్ పాండ్‌లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

అదేవిధంగా గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుకట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని సూచించారు.

గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇరుప మురళి, ఉపసర్పంచ్ కొరస మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, వార్డు మెంబర్ ప్రభాకర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మీకోసం మేమున్నాం

**కష్ట కాలంలో అక్కున చేర్చుకుంటున్నారు**

**వీరి సేవా దృక్పథం సామాన్యులకు వరం**

**భద్రాద్రి న్యూస్ చర్ల**




చర్ల మండలం – జంగాలపల్లి గ్రామానికి చెందిన గగనం రాజు (పూసలు అమ్మే చిరు వ్యాపారి) కుమారుడు గగనం మహేష్ (10) కు అతిచిన్న వయస్సు లోనే కిడ్నీ ఆపరేషన్ జరిగింది... ఈ క్రమంలో యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలతో బాధపడుతున్న అతనికి మీకోసం మేము ఉన్నాంటీం అంటగా నిలిచింది నిరుపేద కుటుంబానికి చెందిన వీరికి ఆర్థిక సహాయం అందజేయాలనే ఆలోచనతో ఫండ్ రైజింగ్ పోస్టు పెట్టి – సేకరించిన పదివేల రూపాయలను లి గురువారం చర్ల లోని మీకోసం మేమున్నాం కార్యాలయంలో, సంస్థ కార్యవర్గ సభ్యులు శేశెట్టి సాంభశివరావు చేతుల మీదుగాలి వారి కుటుంబసభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ... ఇటువంటి అనుకోని కష్టాలు ఎదురైనప్పుడు పేదవారి జీవితాలు కకావికలమై పోతాయని, అటువంటి సందర్భాల్లో మనం అందించే చిరు సహాయం వార్కి ఎంతో ఊరటగా ఉంటుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో పూనెం గౌతమి, కవ్వాల రాము, ముసలి సతీష్, దొడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు...

# పూర్వ విద్యార్థులకు సన్మానం

**ముఖ్య అతిగా హాజరై న సర్పంచ్ ఆదిలక్ష్మి**



**భద్రాద్రి న్యూస్ వెంకటాపురం**



ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి గిరిజన బాలికలు –2 ఆశ్రమ పాఠశాలలో వంద శాతం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన పూర్వ విద్యార్థులను గ్రామానికి చెందిన చేలే నవీన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. నవీన్ అమ్మ జ్ఞాపకార్థం గా పిల్లలకు సానిటరి నాప్ కి న్స్ ను గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయురాలు చేతుల మీదుగా గురువారం విద్యార్థినులకు అందజేశారు. సర్పంచ్ ఆదిలక్ష్మి విద్యార్థులు క్రమశిక్షణ గా ఉండాలని, బాగా చదివి ఉన్నతస్థాయి కి ఎదగాలని ఆకాంక్షించారు. చేలే నవీన్ చిరుతపల్లి గ్రామం లో జన్మించి, గ్రామానికి సేవ చేస్తుండడం గర్వకారణం అని, ఆదివాసి నవనిర్మాణ సేన నేత కొర్సా నర్సింహా మూర్తి, న్యాయ వాది నాగరాజు అన్నారు. తల్లితండ్రులు ఇద్దరు లేకపోయినా తన స్వశక్తి తో ఎదుగుతున్నాడు అని పుట్టిన ఊరికి మంచి చేయాలనే సంకల్పం కలిగి ఉండడం గొప్ప లక్షణం అని కొనియాడారు విద్యార్థులు ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. లక్ష్యాన్ని కలిగిన వారే ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పళ్ల మొక్కలు సర్పంచ్, విద్యార్థుల చేత మొక్కలు నా టించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ చేలే సుజాత, తల్లితండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# చిన్న పొరపాటు కూడా జరగొద్దు







**నివాస్ బట్టు**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.

ములుగు జిల్లాలో ఈ నెల 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నశీ సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అనంతరం వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రం నకు చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు.

ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.




అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు.

అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

